RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -314 పేజీలు - 08 వెల - 04/-

గురువారం 2 అక్టోబర్ 2025



పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

విజయ దశమి శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (శుక్రవారం 3-10-2025) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం శనివారం )



# కూటమి పాలనలో ప్రతి ఇంటా పండగ

## దత్తి గ్రామంలో పెన్షన్లు పంపిణీ సభలో సిఎం చంద్రబాబు

- 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం
- ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం
- ప్రతి నెలా ఓ గ్రామంలో పెన్షన్ల పంపిణీతో పర్యవేక్షణ
- సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం

విజయనగరం,**అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి**

ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని, ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని ఎపి సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని అన్నారు. బుధవారం విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదికలో గ్రామస్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. మానవత్వంతో ఆలోచించి పింఛన్ అందిస్తున్నామన్నారు.

మిగతా 2లో.



# రెపో రేటు 5.5 శాతం యథాతథం

## వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం

- తటస్థ ద్రవ్య విధాన వైఖరికే కట్టుబడిన ద్రవ్య విధాన కమిటీ
- దేశ జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతానికి తగ్గించిన రిజర్వ్ బ్యాంక్



**ఢిలీఅక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి:** సామాన్యులు, రుణ గ్రహీతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ద్రవ్య విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతంగానే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలను వెల్లడించారు. దీంతో ఇప్పట్లో గృహ, వాహన,

మిగతా 2లో.

# టెర్రరిస్టులా చూశారు

## టీడీపీది పైశాచిక ఆనందం: మిథున్ రెడ్డి



2లో



# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం..

- అదే ఆర్ఎస్ఎస్ మార్గం: ప్రధాని మోదీ
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- 'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే సంస్థగా అభివర్ణన
- ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య
- వ్యక్తిత్వ నిర్మాణానికి శాఖలు పవిత్ర వేదికలని కితాబు

**ఢిల్లీ అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు.

మిగతా 2లో.

# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు నిర్ణయం

ఎపిలో నాలుగు,తెలంగాణకు నాలుగు మంజూరు




2లో




# కేంద్ర ఉద్యోగులకు పండుగ కానుక..



- పండుగ సీజన్‌లో కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు
- 2025 జులై 1 నుంచే వర్తించనున్న కొత్త డీఏ
- మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి పెరుగుదల
- లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు చేకూరనున్న లబ్ధి
- త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం

**ఢిల్లీ అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి**

పండుగల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగులకు చెల్లించే కరవు భత్యం (డీఏ)ను మరో మూడు శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై కేంద్ర కేబినెట్ త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన విడుదల చేయనుంది. ఈ పెంపునకు కేబినెట్ ఆమోదముద్ర వేస్తే, మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి చేరుకుంటుంది. ఈ ఏడాది డీఏను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. మార్చి నెలలో ప్రభుత్వం ఇప్పటికే 2 శాతం డీఏను పెంచింది. తాజా పెంపు నిర్ణయాన్ని ఈ ఏడాది జులై 1 నుంచే వర్తింపజేయనున్నారు.

మిగతా 2లో.

# రెపో రేటు 5.5 శాతం యథాతథం

**(మొదటి పేజీ తరువాయి)**

ఇతర రుణాలపై వడ్డీ రేట్లు (ఈఎంఐలు) తగ్గే అవకాశం కనిపించడం లేదు.
ద్రవ్య విధానంపై తటస్థ వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం, అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం మధ్య సమతుల్యత సాధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాల పూర్తి ప్రభావం స్పష్టంగా కనిపించే వరకు వేచి చూడటం సమంజసమని భావిస్తున్నాము" అని ఆయన వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటికే 100 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించామని, ఆ ప్రయోజనాలు ఇంకా ఆర్థిక వ్యవస్థకు పూర్తిగా అందాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు.మరోవైపు, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఆర్బీఐ సానుకూల అంచనాలను ప్రకటించింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడం, జీఎస్టీ రేట్ల కోత వంటి కారణాలతో ద్రవ్యోల్బణం మరింత అదుపులోకి వచ్చిందని గవర్నర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం సగటు అంచనాను గతంలోని 3.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాను కూడా ఆర్బీఐ పెంచింది. దేశీయంగా బలమైన గిరాకీ, అనుకూలమైన రుతుపవనాలు, ద్రవ్య విధాన సరళీకరణ వంటి అంశాల నేపథ్యంలో వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచుతున్నట్లు సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుతం వాణిజ్యపరమైన అంశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నామని, అందుకే వడ్డీ రేట్ల విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నామని ఆయన తెలిపారు.

# టెర్రరిస్టులా చూశారు

"నన్ను 73 రోజుల పాటు జైల్లో ఉంచారు. ఆ సమయంలో నన్ను ఎవరితోనూ మాట్లాడనివ్వలేదు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టారు. విజయవాడ నుంచి నేరుగా పర్యవేక్షించారు. కనీసం జైలు అధికారులు కూడా నాతో మాట్లాడటానికి భయపడ్డారు. ఒక ఉగ్రవాదిని చూసినట్టుగా నన్ను ట్రీట్ చేశారు" అని మిథున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలు ఇచ్చేంత వరకు తనకు కనీస వసతులు కూడా కల్పించలేదని, తనను కలవడానికి వచ్చిన వారిపై కూడా నిఘా పెట్టారని ఆయన వివరించారు. ఇది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి తనను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తోందని, 2014-2019 మధ్య కాలంలో కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వం చేయాల్సిన పనులను పక్కనపెట్టి, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కేసుల ద్వారా తన తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేశారని అన్నారు.ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను వెనక్కి తగ్గేది లేదని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అక్రమ కేసులకు తాను భయపడనని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం..

**(మొదటి పేజీ తరువాయి)**

ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు.సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు.
స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న కవిత

**అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు.బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు.
ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.
మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.

# కేంద్ర ఉద్యోగులకు పండుగ కానుక.



దీంతో ఉద్యోగులకు మూడు నెలల బకాయిలు కూడా అందనున్నాయి.
సాధారణంగా, వినియోగదారుల ధరల సూచీ (%జూ×%) ఆధారంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు ఈ భత్యాన్ని అందిస్తారు. తాజా పెంపు వల్ల లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఉదాహరణకు, రూ. 60,000 ప్రాథమిక వేతనం (బేసిక్ పే) ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం డీఏ రూపంలో రూ. 33,000 అందుతుండగా, కొత్త పెంపు తర్వాత అది రూ. 34,800కి పెరుగుతుంది.
ఇదిలా ఉండగా, ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో జీతాలు, ఇతర అలవెన్సులపై స్పష్టత రానుంది. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక, ప్రస్తుత డీఏను బేసిక్ పేలో విలీనం చేసి సున్నాకు రీసెట్ చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కూటమి పాలనలో ప్రతి ఇంటా పండగ





**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతి నెలా ఒక గ్రామానికి వచ్చి నేరుగా పర్యవేక్షిస్తున్నానన్నారు. అందులో భాగంగా ఈ రోజు దత్తి గ్రామానికి వచ్చానన్నారు. దేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయని, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కేవలం రూ. 500 మాత్రమే పింఛను ఇస్తున్నారని తెలిపారు. వందలో 13 మందికి పింఛను ఇస్తున్నామన్నారు. అందులో 59 శాతం మహిళలకే అందిస్తున్నామన్నారు. ఒక్క పింఛన్‌తో మాత్రమే సరిపెట్టలేదు అనీ, సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం అని, అన్ని పథకాలు అమలు చేశామని అన్నారు. ఆడబిడ్డలు కష్టపడకూడదని ?ఆనాడు దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని గుర్తు చేశారు. ఈనాడు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చునని, పథకం ప్రారంభించిన 45 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు అని చెప్పారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చింది టిడిపి ప్రభుత్వం అని చెప్పారు. డ్వాక్రా రుణాలు తీసుకున్న ఆడ బిడ్డలు తిరిగి కడుతున్నారని, పెద్ద పెద్ద వాళ్లు తీసుకున్న రుణాలు కట్టలేదు గానీ.. ఆడబిడ్డలు మాత్రం తిరిగి చెల్లిస్తున్నారు అని చంద్రబాబు వివరించారు. ఆదాయాన్ని పెంచడం కోసం కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు ఆదాయం పెరగాలి అని చెప్పారు. ఒకప్పుడు రైతును పట్టించుకునే పరిస్థితి లేదు అని అన్నారు. ఆహారపు అలవాట్లు మారాలన్నారు. విజయనగరం జిల్లా పేదరికంలో ఉందని, తగినంత సాగునీరు లేదు? కానీ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని అన్నారు. ఇప్పటికే రైతు భరోసా తో ఒక్కో రైతుకు రూ. 6 వేలు వేశామన్నారు. ఇంకా రూ. 14 వేలు వేస్తామని ప్రకటించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించాం అని చెప్పారు. యువతకు అండగా ఉంటానన్నారు. ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనది అని హామీ ఇచ్చారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. ఇప్పటికే రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, తద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సిఎం చంద్రబాబు వివరించారు.

# రథోత్సవంలో ఊరేగిన మలయప్పస్వామి

## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి** శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహా రథోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో విహరించారు. గోవింద నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పారవశ్యంతో.. గోవిందానామస్మరణతో వీధులు మార్మోగాయి. స్వామివారికి కర్పూర హారతులిచ్చి? నైవేద్యాలు సమర్పించారు. అనాది నుంచి రాజులకు రథసంచారం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల మాడ వీధుల్లో శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తున్నాడు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే ఈ రథోత్సవం ప్రసిద్ధమైంది. తిరుమాఢ వీధుల్లో రథంపై ఊరేగుతున్న శ్రీనివాసునికి భక్తితో నమస్కరిస్తూ ఓం నమో వేంకటేశాయ నామస్మరణ చేస్తున్నారు భక్తులు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన బుధవారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు.బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి.అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు. ఇక ప్రసిద్ధ దేవాలయాలలో ఉత్సవవేళలో దేవుని ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించే ఆచారం, ఆగమశాస్త్ర సిద్ధమై బహుళ ప్రచారంలో ఉంది.తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైంది. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే ' అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పన తో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం.ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళి కృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**: సీఎం చంద్రబాబు నాయుడు**




అమరావతి, **అక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి** తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సకల చరాచర జీవరాశులను సంరక్షించే శక్తి స్వరూపిణి అయిన శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చంద్రబాబు తెలిపారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ నవరాత్రి సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నామని తెలిపారు.
రాక్షస సంహారంతో లోకానికి శాంతి సౌభాగ్యాలు తెచ్చిన ఆ తల్లి చల్లని చూపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ఇదే విధంగా కొనసాగాలని సీఎం చంద్రబాబు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. సంక్షేమం, అభివృద్ధితో ఈ మహాయజ్ఞాన్ని కొనసాగించే నైతిక బలాన్ని అందివ్వాలని ఆ దుర్గమ్మను కోరారు.అనునిత్యం పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు, పేదల సేవలో పెన్షన్లు, మహిళామతల్లులకు ఆసరాగా నిలిచే 'దీపం', ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీశక్తి', బిడ్డలను విద్యావంతుల్ని చేసే 'తల్లికి వందనం' రైతుకు అండగా నిలిచే 'అన్నదాత సుఖీభవ', పేదల చేయిపట్టి అభివృద్ధి వైపు నడిపే 'పీ4' విధానం, పారిశ్రామిక ప్రగతితో ఈ దసరా పండుగ ఇంటింటా వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ... మరొక్కసారి అందరికీ విజయదశమి శుభాకాంక్షలు సీఎం చంద్రబాబు తెలిపారు.

# 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు నిర్ణయం

# ఎపిలో నాలుగు,తెలంగాణకు నాలుగు మంజూరు




**న్యూఢిల్లీ, అఅక్టోబర్ 1, ఆంధ్ర ప్రగతి:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా.. దేశవ్యాప్తంగా 57 నూతన కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు నాలుగు, ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి కేంద్రం రూ. 5,863 కోట్లు కేటాయించినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మంగ సముద్రం, .కుప్పం మండలంలోని బైరుగానిపల్లె, .శ్రీకాకుళం జిల్లాలోని పలాస, .రాజధాని అమరావతిలోని శాఖమూరు ప్రాంతాల్లో ఈ కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం, ములుగు జిల్లా కేంద్రం(గిరిజన ప్రాంతం), .జగిత్యాల జిల్లా - రూరల్ మండలం చెల్గల్, వనపర్తి జిల్లా - నాగవరం శివార్ ప్రాంతాల్లో విద్యాలయాలను కేంద్రం ఏర్పాటు చేయను ంది. మొదటిసారిగా అన్ని 57 కేంద్రీయ విద్యాలయాలను జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మూడు సంవత్సరాల ప్రాథమిక ప్రీ-ప్రైమరీ తరగతులైన బాలవాటికలను కలిగి ఉంటాయి.

## స్నేహబంధం కోసం మద్దిలేటికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందించిన మిత్రులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**
నంద్యాల మండలం పరిధిలోని పెద్ద కొట్టాల గ్రామంలో విషాదం నెలకొంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈట మద్దిలేటి ఇటీవల మరణించారు. మద్దిలేటి ఆకస్మిక మరణంతో వారి కుటుంబం తీరని దుఃఖంలో మునిగిపోయింది. ఈ క్లిష్ట సమయంలో మద్దిలేటి పై ఉన్న స్నేహబంధాన్ని చాటుకుంటూ, వారి మిత్ర బృందం మానవత్వాన్ని ప్రదర్శించింది.
మద్దిలేటి కి బాల్యం నుంచీ సన్నిహితంగా ఉన్న స్నేహితులు... నాగార్జున, మణి, సుప్రియ, ఫాతిమ, నాగమణి, అరుణ్, బ్రహ్మం, వెంకటేష్, శేఖర్, శివ, మాధవ, కోటేష్, ప్రదీప్, సతీష్, రమేష్, విక్రమ్, రాజి, సుబ్బలక్ష్మి, రామేశ్వరి తదితరులు తమ వంతుగా ముందుకు వచ్చారు. వారంతా కలిసి రూ. 50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సేకరించి, మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మొత్తాన్ని నేరుగా మద్దిలేటి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ, మద్దిలేటి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో తమ స్నేహితుడి కుటుంబానికి చేయూతనివ్వడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. మద్దిలేటి మిత్రుల ఈ ఉదారతను పెద్ద కొట్టాల గ్రామ ప్రజలు అభినందించారు, ఈ సహాయం మృతుడి కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు.ం

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన కుటమి నాయకులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 01:**మహానంది మండలంలోని అబ్బీపురం గ్రామంలో ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం మాజీ ఎంపీటీసీ దూదేకుల దస్తగిరి, కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అవకతవకలకు చోటు లేకుండా ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, పూర్తి పారదర్శకతతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ప్రతి నెల అన్ని రోజులు రేషన్ సరుకులు ఇస్తున్నారన్నారు. వృద్ధులు, వికలాంగుల ఇళ్ల కు వెళ్ళి సరుకులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్డుదారులకు అధికారులు ఇంటింటికి తిరిగి తమ స్మార్ట్ కార్డులను ఇస్తారని వీఆర్వో మోహన రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్బీపురం సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శ్యామల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఆయుధ పూజ.

### - ఉద్యోగులు, సిబ్బందికి ఆయుధాలే దైవాలు.!



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** శ్యామల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో బుధవారం ఆయుధ పూజ వేడుకలు ఘనంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వచ్చే మహా నవమి రోజున ఈ పూజను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, నర్సులు, మరియు ఇతర సిబ్బంది తమ వృత్తికి సంబంధించిన పరికరాలు, యంత్రాలు, ఆపరేషన్ థియేటర్ సామాగ్రి, వాహనాలు మరియు కార్యాలయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేశారు.సాధారణంగా ఆయుధ పూజ రోజున ప్రజలు తమకు జీవనోపాధినిచ్చే పనిముట్లను, వాహనాలను పూజిస్తారు. అదేవిధంగా శ్యామల హాస్పిటల్లో రోగులకు మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగించే వైద్య పరికరాలు మరియు యంత్రాలనే దైవాలుగా భావించి పూజించడం ఇక్కడ ప్రత్యేకత సంతరించుకుంది. ఈ పూజల ద్వారా తమ పరికరాలు ఎప్పుడూ ఎలాంటి అడ్డంకులు లేకుండా పనిచేయాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే శక్తిని తమకు ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజీవ్, డాక్టర్ శ్యామల హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మర్యాదపూర్వకంగా కలసిన రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ అక్టోబర్ 01:** మండలం బోయలగుంట్ల గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి, డైరెక్టర్ గా నియమితులైన శ్రీ కాటం రెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో పూల మాలలతో, సన్మానించి బొకేటను అందజేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నా కు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. ఈయన వెంట శిరివెళ్ళ సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాస్ రెడ్డి, డి మురళి తదితరులు ఉన్నారు.

## "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" అవగాహన ర్యాలీని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 01:**
కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం "సూపర్ జీఎస్టీ %-% సూపర్ సేవింగ్స్" అవగాహన కార్యక్రమాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ రైతుల పంట ఉత్పత్తి ఖర్చులు తగ్గి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువ కావడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ట్రాక్టర్, ట్రాక్టర్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయో పెస్టిసైడ్స్, స్ప్రింక్లర్ మరియు డ్రిప్ పరికరాలు, డీజిల్ ఇంజిన్లపై జీఎస్టీ ను 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించిందన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని లాభపడాలని పిలుపునిచ్చారు.
అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రారంభించిన



అవగాహన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులలో సాగింది. ఈ ర్యాలీలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యంత్రాలపై %GST% తగ్గింపుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, మండల




వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాద్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం రైతుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఆధునిక యంత్రపరికరాల వినియోగం పెరుగుతుందని, ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 01:**
నంద్యాల పట్టణం 19వ వార్డు పొన్నాపురం కాలనీలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం నాడు "ఎన్టీఆర్ భరోసా" సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా ఇంటింటికి వెళ్లి అందజేశారు. పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, పింఛన్లు అందుకున్నప్పుడు లబ్ధిదారుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. పింఛన్ల పెంపుదలలో నారా చంద్రబాబు నాయుడు గారే చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, 200 రూపాయల పింఛన్‌ను 1000 రూపాయలకు, అనంతరం 1000ను 2000కు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనేనని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 2000 రూపాయల పింఛన్‌ను 3000కు పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపినా మాట తప్పిందని, ప్రజలకు సంవత్సరానికి రూ. 250 మాత్రమే పెంచుతూ నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీ ప్రకారం 3000 రూపాయల పింఛన్‌ను 4000 రూపాయలకు పెంచి, అదనంగా మూడు నెలల ముందుగానే ప్రతీ లబ్ధిదారికి 1000 రూపాయల చొప్పున మొత్తం 7000 రూపాయలను మొదటి నెలలోనే పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. ఇకపై ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు అందజేయబడతాయని, ఒకటవ తేదీ ఆదివారం వస్తే 31వ తేదీన లబ్ధిదారులకు ముందుగానే పింఛన్లు ఇస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్



యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, వెంకటదాసు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, పొన్నాపురం కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**
నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాది ఖానా నందు నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులు మంత్రి ఎన్ఎండి ఫరూక్ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుల మతలకు అతీతంగా సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందజేస్తున్నామని, అదేవిధంగా 'క్యూఆర్ కోడ్ సౌకర్యంతో కూడిన ఈ కార్డును స్కాన్



చేయడం ద్వారా లబ్ధిదారుడు సరుకులు తీసుకున్న వివరాలు వెంటనే ప్రభుత్వానికి చేరుతాయిని . దీంతో పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, పోర్టబులిటీ విధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించాం.' పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, నంద్యాల ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ప్రజా పంపిణీ అధికారులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## భాషోపాధ్యాయులకు ఘన సత్కారాలు.

### భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం. -ఎస్ ఎల్ టి ఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారాలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**
భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని సంస్థ నంద్యాల జిల్లా అధ్యక్షులు కన్నయ్య పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ హోమ్ లో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన భాషోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లా ,రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భాషోపాధ్యాయులను అభినందించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా ఉప విద్యాధికారి శంకర ప్రసాద్ మండల విద్యాధికారి రామసుబ్బయ్య ఉపాధ్యాయ సంఘం నేతలు ముత్తోజు వీరబ్రహ్మం, షరీఫ్, అన్నెం శ్రీనివాసరెడ్డి ఎంఈఓ లు మార్గరెట్ ,సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర ప్రసాద్ మాట్లాడుతూ భాషోపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి



పొందడంతో పాటు ప్రధానోపాధ్యాయులుగా మండల విద్యాధికారులుగా పదోన్నతి పొంది సమర్థవంతంగా విధులు నిర్వహించడం హర్షనీయమన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించుటలో భాషోధ్యాయుల కృషి కీలకమన్నారు .జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భాషోపాధ్యాయులను అభినందించారు. జిల్లా అధ్యక్షులు కన్నయ్య మాట్లాడుతూ భాషోపాధ్యాయులు ఉన్నతీకరణకు తమ సంస్థ చేసిన కృషిని వివరించారు. అలాగే డి ఈ ఓ పూల్ భాషా పండిట్ల సమస్య పరిష్కారానికి తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. కర్నూలు నంద్యాల జిల్లాలకు చెందిన సంస్థ నాయకులు మద్దిలేటి రమణ, యోగేశ్వర్ రెడ్డి, తాహిర్, వెంకటేశ్వర్లు, సలీం, లింగమయ్య విశ్వనాథరెడ్డి, దామోదర్, రబ్బాని, రాము తదితరుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. భాషాపాధ్యాయ సంస్థ సభ్యత్వాన్ని పెంచడానికి కృషి చేసిన ప్రవీణ్, హబీబుల్లా,రామాంజి త్యాగరాజు తదితరులను సంస్థ కార్యవర్గము అభినందించింది. సత్కారం అందుకున్న వారిలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఖాజాబేగ్ ఉమాదేవి, శిరీష, మార్గరెట్ శ్యామల తదితరులు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయులు శేషఫణి, లక్ష్మయ్య, శ్రీనివాసులు ,హరినాథ్ గౌడ్ తదితరులను సత్కరించారు. మొత్తం 40 మందికి పైగా ఉపాధ్యాయులను తమ సంస్థ సత్కరించినట్లు సంస్థ కార్యదర్శి హుస్సేన్ మియా పేర్కొన్నారు.

# ఖాజా వరలక్ష్మి రేషన్ షాపును ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** నంద్యాల టౌన్ 19 వార్డ్ నందు ఖాజా వరలక్ష్మి రేషన్ షాపును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ఇకనుండి నాణ్యమైన రేషన్ సరుకులను నేరుగా రేషన్ షాపుల వద్ద పొందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, జూన్ 1 నుండి రేషన్ బియ్యంతో పాటు నిత్యవసరాలకు సంబంధించిన సరుకులు కూడా తక్కువ ధరకు అందించనుందని . ఎటువంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి ఒక్కరికి రేషన్ అందే విధంగా డీలర్లు ముందుకు సాగాలన్నారు. అనంతరం 60 సంవత్సరాలు పైబడిన వారికీ ఇంటి దగ్గరికి వెళ్లి సరుకులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 19 వార్డ్ టిడిపి ఇంచార్జ్ షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) ,టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి , ఖాజా శంకర్ , మున్సిపల్ కమిషనర్ శేషన్న , వెంకట దాసు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యలూరు సర్పంచ్ కు అపెంటిక్స్ ఆపరేషన్.

## -ఇంటికే పరిమితమైన సర్పంచ్ ఓబులేసు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 01:** నంద్యాల మండలం అయ్యాలూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఉన్న ఓబులేసుకు గత వారంలో అపెంటిక్స్ ఆపరేషన్ చేయడం జరిగింది. ఈ ఆపరేషన్ తో ఆయన గత వారం రోజులుగా ఇంటికి పరిమితమయ్యారు. నిన్న( మంగళవారం) రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి కుమారుడు జన్మదిన వేడుకలకు అయ్యలూరు సర్పంచ్ ఓబులేసు హాజరు కాకపోవడంతో, కొందరు మీడియా మిత్రులు ఆయన గురించి ఆరా తీయగా అపెంటిక్స్ ఆపరేషన్ వల్ల ఇంటికే పరిమితమైనట్లు కొందరు టిడిపి నాయకులు తెలిపారు. మీడియా మిత్రులతో మంచి సంబంధాలు ఉన్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆ భగవంతున్ని కోరుతున్నామని పలువురు మీడియా మిత్రులు, టిడిపి నాయకులు తెలిపారు. అదేవిదంగా వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడే సర్పంచ్ గా ఉన్న ఆయన టిడిపి పార్టీలో చేరడం అప్పట్లో చర్చనీయాంశమైన విషయం అందరికి తెలిసిందే. అటువంటి కుటుంబానికి టిడిపి పార్టీ ఎల్లవేళలా అండగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

# గిరి బలిజ తొలగించి.. జీవో నెంబర్ 5ను రద్దు చేయాలి.

## మంత్రి ఫారుక్ నకు వినతిపత్రం ఇచ్చిన బలిజ సంఘీయులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** జీవో నెంబర్ 5 వలన బలిజలు మరియు గిరి బలిజలు నష్టపోతారని భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయని మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి బలిజ సంఘం పెద్దలు తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెంటనే సంబంధిత శాఖ మంత్రి సవిత తో ఫోన్లో మాట్లాడి జీవో నెంబర్ 5 విషయం గురించి చర్చించడం దీని వలన భవిష్యత్తులో సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముందని వివరించడం తో మంత్రి సవిత మాట్లాడుతూ.. ప్రస్తుతానికి ఈ జీవోను తటస్థంగా ఉంచామని అమలు చేయడం లేదని రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సరైన నిర్ణయం తీసుకుంటామని ఆమె భరోసా ఇవ్వడం జరిగింది. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం కాకముందే సరైన సమయంలో పరిష్కరించుకుంటే బాగుంటుందని మంత్రి ఫరూక్ , మంత్రి సవిత కు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయంపై చర్చిస్తానని ఇరువురికి నష్టం జరగకుండా చూస్తాననిసంఘీయులకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శెట్టి విజయ్ కుమార్ , ప్రముఖ పారిశ్రామికవేత్త రాజారాం, తోట రామయ్య, చలం బాబు, గాలి చంద్రశేఖర్, కొమ్ము శ్రీహరి, గుద్దేటి వెంకటేశ్వర్లు, పల్లె వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన 38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్న కూటమి ప్రభుత్వం.**

**మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఫిరోజ్ ఆదేశాలతో 38వ వార్డు లో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** నంద్యాల నియోజకవర్గంలో బుధవారం ఉదయం మంత్రి ఎన్ఎండి ఫరుక్, ఎన్ఎండి ఫిరోజ్, ఆదేశాల ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని 38 వార్డ్ లో ఇంచార్జ్ టిడిపి సీనియర్ నాయకులు తాటికొండ బుగ్గ రాముడు ప్రారంభించారు సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ లో సచివాలయ సిబ్బంది కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. 30 సంవత్సరాల లో మొట్టమొదటిసారిగా ఒక్కరోజులో నే రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి 2730 కోట్ల పింఛన్ల మొత్తాన్ని అవ్వ తాతలకు పంపిణీ చేసి, వారిచేత శభాష్ అనిపించుకున్న ఘనత ఒక్క చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. వైఎస్ఆర్ నగర్ లో భర్త చనిపోతే ఒక్క నెలలోనే పెన్షన్ మంజూరు చేసిన ఘనత కేవలం ఒక చంద్రబాబు నాయుడు కే సాధ్యమని చంద్రబాబు నాయుడు మరియు టిడిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 200 పెన్షన్ నుండి 2000లకు 2000 నుంచి 4 వేలకు పెన్షన్లు మంజూరు చేసి అవ్వ తాతలకు,వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చి అందరితో శభాష్ అనిపించుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కె దక్కుతుంది అని తెలియజేశారు. అనంత ఈ కార్యక్రమంలో వడ్డే నాగేంద్ర వెంకటేశ్వర్లు మల్లయ్య 38 వార్డు టిడిపి నాయకులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డిని కలసిన మోత్క లపల్లె టిడిపి నాయకులు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ అక్టోబర్ 01:** బోయలకుంట్ల గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీసవేతనా ల డైరెక్టర్గా నియమితులైన కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ని బుధవారం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన శిరివెళ్ళ మండలం మోత్కుల పల్లి గ్రామ టిడిపి సర్పంచ్ భూమా వేణుగోపాల్ రెడ్డి , శిరివెళ్ళ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పాలూరి శివరామి రెడ్డి , అలాగే మోత్కుపల్లి టిడిపి నాయకులు ప్రతాపరెడ్డి కలిచారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి అభినందనలు ,దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీకాంత్ రెడ్డి కి రాష్ట్ర ప్రభుత్వంలో ఎంతో ప్రాధాన్యమున్న "కనీస వేతనాల శాఖ" డైరెక్టర్ పదవి లభించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, ఆయన నాయకత్వంలో ఆ శాఖ పేద మరియు కార్మిక వర్గాల సంక్షేమం కోసం మరిన్ని నూతన విధానాలు, సంస్కర ణలు చేపడతుందని నమ్ము తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆయన సేవలు రాష్ట్రంలోని కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడంలో మార్గదర్శకంగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జీఎస్టీ తగ్గింపు మధ్య తరగతి కుటుంబాలకు ఊరట.

**రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** వస్తు సేవల పన్ను జీఎస్టీ తగ్గింపు మధ్య తరగతి కుటుంబాలకు ఊరట అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు.

ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాది ఖానా నందు మరియు నంద్యాల 19వ వార్డు నందు జీఎస్టీ కి సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేశంలో మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు దసరా కానుకగా మోదీ జీఎస్టీని తగ్గించి పండుగను వారం రోజులు ముందుగానే తెచ్చారన్నారు. దీని ద్వారా 400 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, 19వ వార్డు పొన్నాపురం కాలనీ ఇంచార్జ్ షేక్ మహమ్మద్ రఫీ (మున్నా), టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ శేషన్న, వెంకట దాస్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు..!

**చెడుపై మంచి గెలుపుకు విజయదశమి ఒక శుభ సంకేతం.**

**జిల్లా మంత్రులు మరియు జిల్లా కలెక్టర్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:** ప్రజలంతా ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఈ విజయదశమిని జరుపుకోవాలని జిల్లా ఇన్చార్జ్ మరియు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ లు బుధవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు విజయదశమి పండుగ పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, రాబోయే రోజుల్లో సాధించే అద్భుత విజయాలకు నాంది పలకాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 2 అక్టోబర్ 2025

# జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు.

## 51 జిల్లాస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 01:**
రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ %-% 2025"లో నంద్యాల జిల్లాకు ఒక రాష్ట్రస్థాయి అవార్డు, 51 జిల్లాస్థాయి అవార్డులు లభించాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద రాష్ట్రంలో తొలిసారిగా సమగ్ర పరిశుభ్రతా సర్వే నిర్వహించి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజా ప్రదేశాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, వంటి స్థిరమైన ఆచరణల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు కేటాయించారని వివరించారు.

జిల్లావ్యాప్తంగా 24 విభాగాల్లో స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల కోసం స్వీయ మదింపు నిర్వహించగా, రాష్ట్రస్థాయి బృందాలు పరిశీలించి అవార్డులను ప్రకటించాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో "మన ఊరు - మన గుడి - మన బాధ్యత" స్వచ్ఛంద సంస్థ రాష్ట్రస్థాయి అవార్డు పొందగా, జిల్లాస్థాయిలో 51 అవార్డులు లభించాయని తెలిపారు. మొత్తం వ్యవస్థను పోర్టల్ మరియు మొబైల్ యాప్ ద్వారా పూర్తిగా డిజిటల్ విధానంలో పారదర్శకంగా నిర్వహించారని కలెక్టర్ వివరించారు. ఈ అవార్డులు స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామపంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు వంటి విభాగాలకు ప్రకటించారన్నారు.

ఈనెల 6వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో అవార్డు విజేతలను ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే జిల్లాకు సంబంధించిన రాష్ట్రస్థాయి విజేతలు, జిల్లాస్థాయి అవార్డు విజేతల పూర్తి వివరాలు ప్రజలు పోర్టల్ (https://sasa.ap.gov.in/) ద్వారా డౌన్‌లోడ్



చేసుకోవచ్చని స్పష్టం చేశారు. "స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ విజేతలు అందరికీ ఆదర్శంగా నిలుస్తారు. మనమందరం శుభ్రత పట్ల కట్టుబడి, స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమాన్ని మరింత బలపరిచేందుకు కృషి చేయాలి" అని కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయిలో "మన ఊరు మన గుడి %-% మన బాధ్యత" స్వచ్ఛంద సంస్థ అవార్డు పొందిందని, జిల్లాస్థాయిలో 51 విభాగాల్లో అవార్డులు లభించాయని కలెక్టర్ పేర్కొన్నారు. వీటిలో

స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్స్ (5): జూపాడుబంగ్లా, పాణ్యం, కోయిలకుంట్ల, బనగానపల్లి, ఉయ్యాలవాడ మండలాలు.

స్వచ్ఛత ఎన్జీవోలు (2): మహమ్మద్ రఫీ సోషల్ ఎన్జీవో, నంద్యాల నవనిర్మాణ సమితి.

స్వచ్ఛత బెస్ట్ వారియర్స్ (5): నంద్యాల, డోన్, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మున్సిపాలిటీలు.

స్వచ్ఛ అంగన్వాడీలు (5): బండి ఆత్మకూరు, బొల్లవరం, చిన్నవంగలి, కాకనూరు, యాలూరు.

స్వచ్ఛ బస్ స్టేషన్: కోయిలకుంట్ల.

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు (3): నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం నంద్యాల, జలవనరుల శాఖ నంద్యాల.

స్వచ్ఛ గ్రామపంచాయతీలు (5): బనగానపల్లి, కోయిలకుంట్ల, కౌలురూ, పాండురంగాపురం, పాణ్యం.

స్వచ్ఛ ఆసుపత్రులు (3): బనగానపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డోన్ ఏరియా ఆసుపత్రి, గవర్నమెంట్ అర్బన్ డెవలప్మెంట్ ఆసుపత్రి బనగానపల్లి.

స్వచ్ఛ హాస్టల్స్ (4): సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ జూపాడుబంగ్లా, ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం గడివేముల, పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహం నంద్యాల, జిటిడబ్ల్యూ ఆశ్రమ స్కూల్ గర్ల్స్ సున్నిపెంట.

స్వచ్ఛ పరిశ్రమలు (2): జయ జ్యోతి సిమెంట్ బనగానపల్లి, అగ్రి సోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉడుములపాడు (డోన్).

స్వచ్ఛ పరిశ్రమలు (3): ప్రేసీ ఫాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ బేతంచర్ల, నీలకంఠేశ్వర సీడ్ కార్పొరేషన్ చాబోలు, ఓం దుర్గా రైస్ మిల్ నందిపల్లె.

స్వచ్ఛ మున్సిపాలిటీ: నంద్యాల.

స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్: ఏపీ ఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ బాయ్స్ జూపాడుబంగ్లా.

స్వచ్ఛ రైతు బజార్: బనగానపల్లి రైతు బజార్.

స్వచ్ఛ పాఠశాలలు (5): మండల ప్రజా పరిషత్ ఎస్టీ స్కూల్ ఉమ్మాయిపల్లి, మండల ప్రజా పరిషత్ స్కూల్ దుద్యాల, పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ కొణిదెల, ఏపీ మోడల్ స్కూల్ రుద్రవరం, జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ హైస్కూల్ కోయిలకుంట్ల.

స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్లు (5): బన్నూరు, బుక్కాపురం, ఉంగరాని కుండ్ల, సిరివెళ్ల, వడ్లరామాపురం. మొదలైనవి ఉన్నాయి.

# వీల్ చైర్ అందచేసిన నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం.

### పేద దివ్యాంగులకు నిరంతర సహకారం: డాక్టర్ రవి కృష్ణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**
పక్షవాతంతో మంచానికే పరిమితమైన రామయ్య అనే వృద్ధునికి చక్రాల కుర్చీ అవసరం వున్నదని తెలపడంతో,నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున అతని సోదరుడు లక్ష్మయ్య గురుస్వామికి చక్రాల కుర్చీ అందచేశారు.నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.పీ.వి. రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నిరుపేద దివ్యాంగులకు సహకారం సంఘం తరపున, లయన్స్ క్లబ్, ఐఎంఏ, మరియు ఇతర దాతల సహకారంతో నిరంతరం కొనసాగిస్తామన్నారు. అవసరమున్న దివ్యాంగులు సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్యతో పాటు లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వెంకటరావు, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ ఆర్ ఎస్ ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు శివరామిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు తోట శ్రీనివాస్, రామయ్య, మురళీధర్ పాల్గొన్నారు.

# వృద్ధులే ప్రతి కుటుంబానికి మార్గదర్శకులు.

### వృద్ధుల ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలి.

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**వృద్ధులు ఇంట్లో వాళ్లకు మార్గ దర్శకులు, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం కుటుంబ సభ్యుల బాధ్యత అని డాక్టర్ ఆర్. వెంకటరమణ అన్నారు.అక్టోబర్ 1వ తేదీ అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుచు, 60 సంవత్సరముల వయసు పైబడిన పురుషులు, మహిళలు ఎక్కువ శాతం రక్త పోటు, మధుమేహం, హృదయ సంబంధ, కాలేయ సంబంధ, మూత్ర సంబంధ వ్యాధులు, సమస్యలతో బాధపడుతుంటారని, కొందరు కుటుంబ సభ్యుల ద్వారా మానసిక ఆందోళన లకు గురవుతుంటారని, మతి మరుపుతో వారి మాటలు, ప్రవర్తన లో మార్పులు వస్తాయని, కొందరు పక్షవాతము, మెదడు సంబంధ, నరాల బలహీనత, విపరీతమైన వళ్ళు నొప్పులతో బాధ పడుతుంటారని, ఈ సమస్యలతో స్వతగా వారి పనులు వారు చేసుకోలేక, స్వంతంగా ఆహారం తినలేక, బాత్రూం లకు నడవలేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతారని, ఇంట్లో కుటుంబ సభ్యులు, మనుమళ్ళు, మనుమరాళ్లు వయో వృద్ధులతో సరిగా మాట్లాడకపోవడం వలన మానసికంగా కుంగు బాటుకు గురవుతారని, ఇంట్లో ఉన్న అలాంటి వయో వృద్ధులకు కుటుంబ సభ్యులు అండగా ఉండాలని, వారితో రోజు మాట్లాడటం, వారి అవసరాలు గురించి విచారించి తీర్చడం వలన వారు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్న కూటమి ప్రభుత్వం.

### వేకువ జామునే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో

### పాల్గొన్న స్టేట్ మార్క్ ఫెడ్ డైరెక్టర్,సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి.





**ఆంధ్రప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 01:**
నంద్యాల నియోజవర్గంలోని కొత్తపల్లె గ్రామంలో పాల్గొని లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పెన్షన్ అందించారు, తెల్లవారుజామున 6:30 నిమిషములకు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ స్టేట్ మార్క్ ఫ్రెండ్ డైరెక్టర్ సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు,కిడ్నీ బాధితులకు ఇస్తున్న పెన్షన్ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకుందని ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆటంకములు ఏర్పడినను పెన్షన్ పంపిణీ జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ పంపిణీ చాలా సీరియస్ గా తీసుకుని పెన్షన్ పంపిణీచేస్తున్నట్లతెలిపారు,ఒకటవ తేదీ కావడంతో ఈరోజు పెన్షన్ అందించామని అన్నారు.పేద ప్రజల పక్షాన నిలబడాలన్న కూటమి ప్రభుత్వలక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని తులసి రెడ్డి పేర్కొన్నారు, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన జరుగుతుందని తెలపడానికి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిలుస్తుందని ఆయన అన్నారు,వాలంటీర్ల వ్యవస్థ ఉండదు పెన్షన్ పంపిణీ సజావుగా జరగదని అప్పుడు అధికారంలో ఉన్న వైసిపి నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి ఏవేవో మాట్లాడారు.వాలంటీర్ల వ్యవస్థ లేకపోయినా సచివాలయం సిబ్బందితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి నెల నుండే పెన్షన్ పెంచారనిఆయనతెలియజేశారు. ఇంటికి వెళ్లిపెన్షన్ అందించేటప్పుడు పెన్షన్ దారుల కళ్ళల్లో ఆనందాన్ని చూశానని ప్రభుత్వంలో భాగస్వామ్యమై పెన్షన్ క్రమంలో పాల్గొనటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, టిడిపి నాయకులు ధనుంజయ గౌడ్, సుబ్బారెడ్డి, ధను, నాగార్జున రెడ్డి, పుల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న బుట్టబొమ్మ బొమ్మల కొలువు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 01:**
నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గత 11 రోజులుగా సెప్టెంబర్ 20 నుండి జరుగుతున్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ జాతీయస్థాయి ఎన్సిసి క్యాంపులో భాగంగా బుట్ట బొమ్మ బొమ్మల కొలువు ఎక్స్పో మరియు ఎగ్జిబిషన్ ఆసక్తిదాయకంగా సాగింది. బీహార్ జార?ండ్ నుండి వచ్చినటువంటి క్యాడేట్స్

ఇక్కడ ప్రదర్శించిన కొండపల్లి, ఏటికొప్పాక, ధర్మవరం తదితర ప్రాంతాల నుండి సేకరించిన పురాతన సాంప్రదాయ బొమ్మల కొలువు మరియు ప్రదర్శనను తిలకించడమే కాకుండా కొనుగోలు కూడా చేశారు. ఈ బొమ్మల కొలువును ఎక్స్పోన్ నిర్వహించిన శ్రీమతి లావణ్య రామకృష్ణ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి. నంద్యాల పట్టణంలో బుట్టబొమ్మ షాపును నిర్వహిస్తూ ఒక కొత్త తరం ఎంటర్ప్రెన్యూర్ తో ముందుకు వెళ్తున్న లావణ్యను కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యా సంస్థల అధినేత చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 11 రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి ఎన్సిసి క్యాంపులో భాగంగా ఈ బొమ్మల కొలువు బుట్టబొమ్మ ఎక్స్పో ప్రారంభిస్తూ ఎంత ఆసక్తిగా శ్రీమతి లావణ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి అభినందనలు తెలియజేస్తూ ప్రాచీన కళలు ఉట్టిపడే విధంగా మన సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా ధర్మవరం, కొండపల్లి, ఏటికొప్పాక నుండి సేకరించిన బొమ్మల కొలువు మరియు కొనుగోలు ఎక్స్పో క్యాంపుకు హాజరైన 500



మంది ఎన్సీసీ క్యాడేట్స్ తిలకించడమే కాకుండా కొనుగోలు కూడా చేశారు. ఇలాంటివారిని మనమందరము ప్రోత్సహించాలి అని వీలైతే నంద్యాల పట్టణంలో టిటిడి కళ్యాణ మండపం రోడ్డు వందేమార్ట్ పక్కన ఉన్న బుట్ట బొమ్మ ఎక్స్పో షాపును కూడా సందర్శించి ప్రోత్సహించాలని అన్నారు. బీహార్ జార?ండ్ నుండి వచ్చిన ఎన్సీసీ కాడేట్స్ భారీ ఎత్తులో బొమ్మలను కొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి లావణ్య మాట్లాడుతూ క్రొత్త తరహా ఎంటర్ప్రెన్యూర్ లో మాలాంటి వాళ్లను ప్రోత్సహిస్తున్న రామకృష్ణారెడ్డి సారుకు





కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్సిసి క్యాంపులో కార్యక్రమాలు ఎక్కువగా ఉండడం సమయం లేకపోయినా కూడా సమయాన్ని కల్పించుకొని ఈ ఎక్స్పో కార్యక్రమాన్ని నిర్వహించానని ఇందుకు అవకాశం కల్పించిన రామకృష్ణ రెడ్డి సార్ కు ఎన్సిసి గ్రూప్ కమాండర్ కాల్నెల్ అలోక్ త్రిపాఠి మరియు కాల్నెల్ జోబి ఫిలిప్ లెఫ్టినెంట్ కాల్నెల్ శ్రీ ప్రియ మేడం తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రూప్ కమాండర్ కాల్నెల్ అలోక్ త్రిపాఠి ఎన్సిసి సిబ్బంది అందరూ ఈ బుట్ట బొమ్మ ఎక్స్పోను ఆసక్తిగా తిలకించారు. అవకాశము ఉన్న వాళ్ళందరూ కొనుగోలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్సిసి సిబ్బంది ఎన్సిసి పి ఐ స్టాఫ్ ఎన్సిసి క్యాడెక్స్ పాల్గొన్నారు.

# కులగోడల్ని కూల్చివేద్దాం సమ సమాజాన్ని నిర్మిద్దాం.



**ఆంధ్ర ప్రగతి వెలుగోడు అక్టోబర్ 01:**వెలుగోడు మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక వెలుగోడు లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి ఆనంద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేనటువంటి కుల వ్యవస్థ భారత దేశంలో ఉందని ఈ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఒక కులాన్ని మరొక కులం అవమానపరుస్తూ అంటరానితనాన్ని పెంచి పోషిస్తుంది అన్నారు. దీన్ని ఆసరా చేసుకొని పాలక పార్టీలు తమ స్వలంబ నా కోసం కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ మరింత దాడులకు ఉసిగొలుపుతూ ప్రజల లౌకికత్వాన్ని భంగం కలిగిస్తుంది అన్నారు . ముఖ్యంగా దేశంలో ఆర్ఎస్ఎస్ బిజెపి తమ హిందుత్వ ఫాసిజాన్ని ముందుకు తీసుకువచ్చి ఒకే భాష .ఒకే తిండి .ఒకే సంస్కృతి పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ముస్లింల పైన దళితుల పైన మరింత దాడులు చేయడానికి పూనుకుంటుందన్నారు. నాడు మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో అస్పృశ్యత అంటరానితనం లకు వ్యతిరేకంగా కుల నిర్మూలన పోరాటాలు చేశాడు ఆయన పోరాట స్ఫూర్తితో కుల గోడల్ని కూల్చివేసి సమ సమాజాన్ని నిర్మించుట కొరకు కుల నిర్మూల పోరాటాలకు సమాజంలోని ప్రగతిశీల భావాలు గల మేధావులు .విద్యావంతులు. యువకులు, విద్యార్థులు బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం నాయకులు బండి వెంకటేశ్వర్లు. ఎం తిరుపాలు బి నాగరాజు రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పదిరోజుల వైభవం.. దసరా వైశిష్ట్యం !

**అక్టోబర్ 01 ఆంధ్ర ప్రగతి**

హిందువులు జరుపుకునే పండగలలో దసరా పండగకు విశిష్ట స్థానం ఉంది. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణవధ, జమ్మి ఆకుల పూజా చేయటం ఆనవాయితీగా వస్తోంది. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి. అందుకే దసరా హిందువులకు ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవరోజు విజయదశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి, తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులు, దేవీ నవరాత్రులు లేక శరన్నవరాత్రులు అని అంటారు. ఈ దసరా ఉత్సవాన్ని నవరాత్రులుగా తొమ్మిది రోజులు పాటు జరుపు కుని.. 10వ రోజున దసరా లేదా విజయదశమిగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులు శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి అవతారాలను అంటే నవదుర్గలను అత్యంత భక్తీ శ్రద్దలతో పూజిస్తారు. ఈ దేవీ నవరాత్రులలో చివరి మూడు రోజులు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా జరుపుకుంటూ విద్యార్థులు పుస్తకాలూ, పెన్నులను పూజిస్తే, శ్రామికులు తమ పనిముట్లను పూజిస్తారు. ఇక క్షత్రియులు ఆయుధ పూజ చేసి.. అమ్మవారి కృపకు పాత్రులవుతారు. దుర్గాదేవి మహిషాసురమర్దనిగా అవతరించి రాక్షసుని మీదకు దండెత్తి విజయం సాధించింది. అంతేకాదు రాముడు రావణ సంహారం చేసింది దసరనే.. కనుక పూర్వం రాజులు తమ దండయాత్రకు దసరా పండగనే శుభ ముహూర్తంగా ఎంచుకునే వారని తెలుస్తోంది. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశం లో హెచ్చుగా ఉంటుంది. దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మ దేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లి పోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, మహిషాసురా ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు.'పితామహా.,నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మహిషాసురా.. పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.., గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు.



జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహాసముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు. ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక,నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషా సురుడు 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే.. ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక,పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధాన మయ్యాడు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితు డైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధము చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజముగా మారింది. త్రిమూర్తుల తేజము కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మ తేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలమును, విష్ణువు చక్రమును, ఇంద్రుడు వజ్రాయుధమును, వరుణ దేవుడు పాశము, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలము హిమవంతుడు సింహమును వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధములు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషా సురుని తరపున పోరు సల్పుతున్న ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో అమ్మ తలపడినది. ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషి రూపము, సింహరూపము, మానవరూపముతో భీకరముగా పోరి చివరకు తిరిగి మహిషిరూపములో దేవిచేతిలో హతుడైనాడు. ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినము కాబట్టి మహిషాసుర మర్ధనిని కొలిచే దసరా పర్వదినంగా ప్రజలచే కొనియాడబడింది. ఉత్తర భారతంలో దసరాను రావణ దహనంగా నిర్వహిస్తారు. దక్షిణాన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపుగా నిర్వహిస్తారు. ఇలా ఒక్కోచోట ఒక్కో విధంగా అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఎలా పూజించినా అమ్మవారితో పాటు, ప్రకృతిని ఆరాధించడం శరన్నవరాత్రులు, దసరా విష్టతగా చెప్పుకోవాలి.

## ఫీజు రియంబర్స్‌మెంట్ వ్యవహారం

### మరోమారు కాలేజీల బంద్‌కు యాజమాన్యాల యత్నం



హైదరాబాద్,**అక్టోబర్ 01 ఆంధ్ర ప్రగతి**తెలంగాణ రాష్ట్రంలో మరోసారి బంద్ దిశగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు అడుగులు వేస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయని నేపథ్యంలో 2025 దసరా పండగ తర్వాత అక్టోబర్ 6 నుంచి విద్యా సంస్థలు తెరవొద్దని కాలేజీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. అయితే విద్యా సంస్థలు బంద్‌పై కాలేజీ యాజమాన్యాలు అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. ఇటీవల రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. సెప్టెంబర్ 15 నుంచి నిరవధిక బంద్‌కు కాలేజీల యాజమాన్యాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. బంద్ విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతుందని ప్రభుత్వం కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన చర్చలలో కాలేజీల యాజమాన్యాలు వెనక్కి తగ్గాయి. ప్రభుత్వంతో చర్చల అనంతరం దసరా వరకు పెండింగ్‌లో ఉన్నమొత్తం బకాయిల్లో రూ.600 కోట్లను విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం చెప్పారు. అయితే డిప్యూటీ సీఎం ప్రకటన చేసి రెండు వారాలు గడుస్తున్నా.. ప్రభుత్వం ఇంకా బిల్లులను విడుదల చేయలేదు. పెండింగ్ బకాయిలు ప్రస్తుతం ఇచ్చే పరిస్థితి లేదని ప్రభుత్వం కాలేజీల యాజమాన్యాలకు స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో భవిష్యత్ కార్యాచరణకు ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీలు సిద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా ఫెడరేషన్ అఫ్ అసోసియేషన్స్ అఫ్ తెలంగాణ హైయ్యర్ ఎడ్యుకేషన్స్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు అత్యవసర మీటింగ్ జరిగింది. కాలేజీలు బంద్ చేయాలనే మెజారిటీ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారంట. దసరా తర్వాత విద్యా సంస్థలు తెరవోద్దనే ఆలోచనలో యాజమాన్యాలు ఉన్నాయని తెలుస్తోంది. యాజమాన్య సంఘాలు తమ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్న తెలుస్తోంది.

## 3న ఎపి కేబినేట్ భేటీ

### మోడీ పర్యటన, అమరావతిపైచర్చ



అమరావతి, **అక్టోబర్ 1ఆంధ్ర ప్రగతి**

ఏపీ కేబినెట్అక్టోబర్ 3వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమవ్వనుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఏపీ పర్యటన, జీఎస్టీ సహా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. ఈ నెల 16వ తేదీన ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం జీఎస్టీపై కర్నూలులో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించి మంత్రివర్గంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏపీలో నిర్వహించ నున్న జీఎస్టీ కార్యక్రమాలకు సంబంధించి కేబినెట్ సమావేశంలో మంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి కేబినెట్ చర్చించనుంది. కొత్త జిల్లాల ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారని సమాచారం. ఇటీవల పలువురు ఎమ్మెల్యేల వ్యాఖ్యలు దుమారం రేపిన నేపథ్యంలో వాటిపై, అలాగే సోషల్ మీడియా ప్రచారంపై సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేసే అవకాశం ఉందని సమాచారం.

## వైభవంగా బతుకమ్మ వేడుకల ముగింపు

### జిల్లాలో ఉత్సాహంగా సాగిన పూలపండగ -ఆడిపాడిన ఆడపడచులు..యువత కేరింతలు

హైదరాబాద్,**అక్టోబర్ 01 ఆంధ్ర ప్రగతి**

తొమ్మిది రోజుల పాటు సందడి చేసిన బతుకమ్మ సంబరాలు ముగిసాయి. కొన్నిచోట్ల పదిరోజులు ఆడిపాడారు. హైదరాద్ ట్యాంక్‌బండ్‌పై పదిరోజుల నాడు సద్దుల బతుకమ్మ నిర్వహించారు. పెద్ద ఎత్తున నిర్వహించిన వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఊపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, పలువురు ప్రముఖ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ గిన్నీస్ బుక్‌లో చోటు సాధించింది. వచ్చే యేడాది మళ్లీ రావమ్మా అంటూ ఆడపడచులు బతుకమ్మకు వీడ్కోలు పలికారు. బుధవారం సద్దుల బతుకమ్మతో ఊరూవాడ సందడిగా కొనసాగింది. ఆడపడుచుల వీడ్కోలుతో బతుకమ్మ సాగిపోయింది. తెలంగాణలో ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు పూల జాతరతో జరుపుకున్న బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిసింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా పల్లె, పట్నం, ఊరూ, వాడా, తంగేడు, గునుగు పువ్వుల వనాలయ్యాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. మొత్తంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబురంగా ముగిసింది. తెలంగాణ ఇంట ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు రకరకాలపూలతో ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఆడబిడ్డలు రామ రామ రామ ఉయ్యాలో.. తొమ్మిది రోజులు ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. తెలంగాణ బిడ్డలకు దీవెనలు ఇస్తూ బతుకమ్మ.. గంగమ్మ ఒడికి చేరింది. వర్షాలతో చెరువులు, కుంటలు కళకళలాడడంతో బతుకమ్మలకు కలసివచ్చింది. పూల సింగిడి సందడి చేసింది.. సద్దుల సంబురం కనులవిందు చేసింది.. ఆడపడుచుల ఆనందం ఆకాశాన్నంటింది.. తొమ్మిదిరోజుల పాటు సంబురంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు సంబురంగా జరుపుకున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ సంబురాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగవైభవంగా జరిగాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళా



ఉద్యోగులు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొని చివరిరోజు ట్యాంక్‌బండ్‌తో సహా, జిల్లాల్లో భారీ బతుకమ్మతో వేడుకలు నిర్వహించుకోగా సద్దుల బతుకమ్మను జిల్లా మహిళా మణులు భారీ బతుకమ్మలతో ఆడిపాడారు. అన్ని గ్రామాల్లో పూలపండగతో మహిళలు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున బతుకమ్మ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజు ప్రతీ ఇంటా బతుకమ్మను పేర్చి ఇళ్లవాకిళ్ల ఎదుట బతుకమ్మ పాటలతో ఆడిపాడి చివరికి బతుకమ్మ ఘాట్‌ల వద్ద కూడా చిందేశారు. బతుకమ్మ ఉత్సవంలో చివరిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. ఆడపడుచులతో ఆడిపాడి సంబురంలో పాల్గొన్నారు. గల్లీల నుంచి పట్నం వరకు చిన్నారుల నుంచి పెద్దల వరకు బతుకమ్మ ఉత్సవాలను కనుల పండువగా జరుపుకున్నారు. రోజుకొక శాఖ ఉద్యోగులు కార్యాలయాల్లో బతుకమ్మలు పేర్చి డీజే పాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలు ట్యాంక్‌బండ్ వద్ద సంబరంగా సాగాయి. సాంస్కృతిక కళారూపాలతో, పెద్దఎత్తున డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలతో ట్యాంక్‌బండ్‌వరకు ఊరేగింపు కళాత్మకంగా సాగింది. రాత్రి పొద్దుపోయేవరకు ట్యాంక్‌బండ్‌పై ఆడబిడ్డలు బతుకమ్మ ఆడారు. వరంగల్ నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వేల మంది మహిళలు హన్మకొండలోని పద్మాక్షి గుండం, వరంగల్‌లోని రంగసముద్రం వంటి ప్రాంతాల్లో ఆడిపాడారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సద్దుల పండుగ ఉత్సాహంగా సాగింది. పలు ప్రాంతాల్లో ఉత్తమ పాట, ఆటలకు బహుమతులు ప్రకటించడంతో ఆడిపాడేందుకు యువతులు పోటీపడ్డారు. సిద్దిపేటలో పెద్ద ఎత్తున కోమటి చెరువు వద్ద ఆడిపాడారు. ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం -ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

విశాఖపట్టణం,అక్టోబర్1**ఆంధ్ర ప్రగతి**ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను వరుణుడు ఏమాత్రం వదిలిపెట్టడం లేదు. మొన్నటి వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గక ముందే.. మరో అల్పపీడనం కదలికలు ప్రారంభించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశముందని, వచ్చే నాలుగు రోజులపాటు రెండు రాష్ట్రాల్లోన్రూ వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరించింది. గత కొన్ని నెలలుగా ఏపీ, తెలంగాణలో వర్షాలే ప్రధాన సమస్యగా మారాయి. కాలం మారినా వానలు మాత్రం ఆగడంలేదు. కొన్నిచోట్ల కుండపోతగా కురుస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఇటీవల బంగాళాఖాతంలోని వాయుగుండం కారణంగా రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. ఇప్పుడు మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. విపత్తుల నిర్వహణ సంస్థ సమాచారం ప్రకారం, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడనం వాయువ్య దిశగా కదిలి గురువారానికి వాయుగుండంగా బలపడనుంది. శుక్రవారం



ఉదయానికి ఇది దక్షిణ ఒడిశా ? ఉత్తరాంధ్ర తీరాలను తాకే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజులపాటు వర్షాలు కురుస్తాయని అంచనా. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఏలూరు, కృష్ణా జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 12 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అనంతరం తీవ్ర వాయుగుండంగా మారి .. ఎల్లుండి ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశముందని పేర్కొంది. దీని ప్రభావంతో ఇవాళ విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, యానాం, కోనసీమ, ఉభయగోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఇవాళ ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, అల్లూరి, మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మత్స్యకారులు నాలుగు రోజుల పాటు వేటకు వెళ్లవద్దని సూచించారు. తీర ప్రాంతాల్లోని అన్నిపోర్టులకు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు తెలంగాణలోనూ మూడు నుంచి నాలుగు రోజుల వరకు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, గురువారం, శుక్రవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 2 అక్టోబర్ 2025



# భారత్‌కు క్షమాపణలు చెప్పిన పీసీబీ చీఫ్

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు క్షమాపణలు చెప్పారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ ఇకపై కొత్తగా మొదలుపెట్టాలని అన్నారు. నఖ్వీ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ తర్వాత ట్రోఫీని తనతో తీసుకెళ్లారు. ఈ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌ను ఓడించిం. నఖ్వీ ఇంతకాలం మొండిగా ఉన్నారు, కానీ ఇప్పుడు దిగివచ్చారు. ట్రోఫీని తిరిగి ఇవ్వడంపై కూడా స్పంంచారు.నఖ్వీ మాట్లాడుతూ.. ఏసీసీ సమావేశంలో, "ఏం జరిగిందో జరగకూడదు, కానీ ఇప్పుడు మనం కొత్తగా ప్రారంభించాలి. సూర్యకుమార్ యాదవ్ స్వయంగా వచ్చి ట్రోఫీని తీసుకెళ్లవచ్చు." దుబాయ్‌లో మంగళవారం (సెప్టెంబర్ 30)న ఏసీసీ సమావేశం జరిగిం. ఇందులో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అంశాన్ని లేవనెత్తిం. ఆ తర్వాత నఖ్వీ క్షమాపణలు చెప్పారు. ఫైనల్‌లో పాకిస్థాన్ ఓడిపోయిన తర్వాత నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవడానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిరాకరించారు. నఖ్వీ చాలాసేపు ఎదురుచూశారు, కానీ టీమ్ ఇండియా ఆటగాళ్లు అంగీకరించలేదు. ఆ తర్వాత నఖ్వీ ట్రోఫీ, మెడల్ రెండింటినీ తీసుకుని వెళ్లిపోయారు.పాకిస్థాన్ నుంచి కూడా నఖ్వీకి కష్టాలు పెరుగుతున్నాయి. మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది నఖ్వీని వ్యతిరేకిస్తూ.. ఆయన ఒక పదవికి రాజీనామా చేయాలని అన్నారు. నఖ్వీ పీసీబీ చీఫ్‌గా ఉండటంతోపాటు పాకిస్తాన్ హోంమంత్రిగా కూడా ఉన్నారు. అఫ్రిది టెలికాం ఆసియా స్పోర్ట్‌తో మాట్లాడుతూ.. నఖ్వీ ఒక పదవికి రాజీనామా చేయాలి. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉం.మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ మాట్లాడుతూ.. క్షమాపణలు చెబుతున్నారా లేదా అనే వేరే విషయం. ట్రోఫీ అతని వ్యక్తిగత ఆస్తి కాదు, అతను ఎలా తీసుకెళ్లారు. ఔట్ అయితే బ్యాట్, బాల్ తీసుకుని వెళ్లినట్లుగా ఉంది ఇది.

# టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ ఆల్‌టైమ్ హైయ్యెస్ట్ రేటింగ్స్



టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ సరికొత్త చరిత్ర సృష్టించాడు. తాజాగా ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అభిషేక్ వరల్డ్ రికార్డ్ కొట్టాడు. టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న అభిషేక్ తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అంతేకాకుండా తాజా ర్యాంకింగ్స్‌లో ఈ ఫార్మాట్‌లో 931 రేటింగ్ పాయింట్లు సాధించి అరుదైన రికార్డ్ కొట్టాడు. అయితే టీ20 చరిత్రలో ఏ బ్యాటర్ కూడా ఈ రేటింగ్ సాధించలేదు. దీంతో టీ20ల్లో అరంగేట్రం చేసిన ఏడాలోనే అభిషేక్ వరల్డ్ రికార్డ్ కొట్టాడు.కాగా, భారత్ నుంచి టీ20 ర్యాంకింగ్స్‌లో 900ం రేటింగ్స్ సాధించిన మూడో బ్యాటర్ అభిషేక్. అయితే అందరికంటే 931 రేటింగ్స్ సాధించగా, గతంలో సూర్య 912 రేటింగ్స్, విరాట్ కోహ్లీ 909 రేటింగ్స్ సాధించారు. ఇక తాజా ర్యాంకింగ్స్ విషయానికొస్తే ఆసియా కప్‌లో నిలకడగా రాణించిన తిలక్ వర్మ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రీలంక బ్యాటర్ నిస్సంక రెండు స్థానాలు మెరుగుపర్చుకొని ఐదో ప్లేస్‌కు చేరుకున్నాడు.బౌలింగ్ విషయానికొస్తే, టీమ్‌ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 రేటింగ్స్) టాప్ ప్లేస్‌లోనే కొనసాగుతున్నాడు. ఇదే టోర్నమెంట్‌లో 17 వికెట్లతో టాప్‌లో నిలిచిన కుల్దీప్ యాదవ్ ఏకంగా తొమ్మి స్థానాలు ఎగబాకాడు. 648 రేటింగ్స్‌తో 12వ స్థానం దక్కించుకున్నాడు. పాకిస్థాన్ పేసర్ షహీన్ షా అఫ్రిదీ 12 ప్లేస్‌లు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం 635 రేటింగ్స్‌తో 13వ స్థానంలో కొనసాగుతున్నాడు.కాగా రీసెంట్ గా ముగిసిన ఆసియా కప్‌లో అభిషేక్ నిలకడగా రాణించాడు. టీమ్‌ఇండియా విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 7 మ్యాచ్‌ల్లో 200.00 స్ట్రైక్ రేట్‌తో 317 పరుగులు బాదాడు. ఇందులో 19 సిక్స్‌లు, 32 ఫోర్లు ఉన్నాయి. రెండుసార్లు హాఫ్ సెంచరీ సాధించి టోర్నీలో అత్యధిక పరుగులు బాదిన ప్లేయర్‌గా రికార్డు కొట్టాడు. దీంతో అభిషేక్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యాడు. అటు తిలక్ వర్మ కూడా అద్భుతంగా రాణించాడు. 71 యావరేజ్‌తో 6 ఇన్నింగ్స్‌ల్లో 213 పరుగులు బాదాడు. ఫైనల్‌లో తిలక్ ఆడిన 69 పరుగులు ఇన్నింగ్స్ టోర్నీ లోనే హైలైట్. ఈ ఇన్నింగ్స్‌తో భారత్‌ను విజేతగా నిలిపాడు.

# ప్రాక్టీస్ సెషన్‌కు పలువురు ఆటగాళ్లు దూరం



ఆసియా కప్ 2025 టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియా నాలుగు రోజుల వ్యవధిలోనే వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సిద్ధమైంది. గురువారం(అక్టోబర్ 2) నుంచి అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌లో బరిలోకి దిగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం అహ్మదాబాద్ చేరిన భారత జట్టు ప్రాక్టీస్ కూడా ప్రారంభించింది. ఈ ఇంటెన్స్ ప్రాక్టీస్ సెషన్‌కు టీమిండియా స్టార్ ఆటగాళ్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ దూరంగా ఉన్నారు.ఆసియా కప్ 2025 ఫైనల్ ఆడిన ఈ ముగ్గురు ఆటగాళ్లు.. అలసటను తొలగించుకునేందుకు ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదని తెలుస్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఇతర ఆటగాళ్లంతా ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఈ ప్రాక్టీస్ సెషన్‌ను పర్యవేక్షించాడు. మూడు గంటల పాటు సాగిన ఈ ప్రాక్టీస్ సెషన్ లైట్ వార్మప్‌తో మొదలైంది.ఆ తర్వాత ఫీల్డింగ్ ప్రాక్టీస్‌తో పాటు నెట్స్‌లో ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ నెట్స్‌లో స్పిన్నర్లతో పాటు ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొన్నారు. మిడిలార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ భారీ షాట్లు సాధన చేశారు. గిల్.. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సుదీర్ఘ స్పెల్స్ బౌలింగ్ చేశారు. ఈ ఇద్దరూ ఆటగాళ్లు భారత్-ఏ తరపున.. ఆస్ట్రేలియా-ఏతో టెస్ట్ సిరీస్ ఆడారు. బౌలింగ్ రిథమ్‌ను అందుకునేందుకు శ్రమించారు. గంభీర్.. ఈ మ్యాచ్‌కు సంబంధించిన పిచ్‌ను పలుమార్లు పరిశీలించాడు. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు టీమ్ కాంబినేషన్‌ను ఎంపిక చేయడంపై గంభీర్ ఫోకస్ పెట్టాడు.ఆస్ట్రేలియా-ఏతో శతకం సాధించిన దేవదత్ పడిక్కల్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. నితీష్ కుమార్ రెడ్డితో జట్టుకు బ్యాటింగ్‌తో పాటు అదనపు పేస్ ఆప్షన్ లభించనుంది. మరోవైపు వెస్టిండీస్ జట్టు వర్షం కారణంగా ఇండోర్ నెట్స్‌కే పరిమితమైంది. అరగంట మాత్రమే సాధన చేసింది. ఈ మ్యాచ్ పిచ్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనున్నాయి. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు జడేజా కీలకం కానున్నాడు.

# క్రీడల్లోకి రాజకీయాలను తేవొద్దు

**• మాజీ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ**



తాజాగా ముగిసిన ఆసియకప్ ఎన్నడూ లేని విధంగా వివాదస్పదంగా జరిగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా, ఇండియా, పాకిస్తాన్ ప్లేయర్ల ప్రవర్తనతో ఈ సారి ట్రోఫీ హాట్ హాట్ గా నడిచిం. పెహల్గాం దాడికి నిరసనగా భారత క్రికెటర్లు.. పాక్ క్రికెటర్లతో హ్యాండ్ షేక్ చేసేందుకు నిరాకరించారు. రెండు లీగ్ మ్యాచ్ లతోపాటు, ఫైనల్ ముగిశాక కూడా వారు ఈ విధంగానే ప్రవర్తించారు. అలాగే పాక్ క్రికెటర్లు కూడా మైదానంలో లేకిగా ప్రవర్తించారు. బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ తుపాకితో కాల్చుతున్నట్లుగా సంబరాలు చేసుకోగా, బౌలర్ హారీస్ రవూఫ్ ఫైటర్ జెట్లు నేలకూలినట్లుగా గెశ్చర్ వేసి, ఐసీసీతో మొట్టికాయలు వేసుకున్నారు. ఈక్రమంలో టోర్నీలో దాయాదుల మధ్య జరిగిన మూడు మ్యాచ్ లు హాట్ గా నడిచాయి. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్ లో పాక్ పై 5 వికెట్లతో భారత్ ఘన విజయం సాధించి, రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి కప్పును సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఓవరాల్ గా ఈ టోర్నీలో మూడుసార్లు పాక్ ను ఇండియా చిత్తు చేసిం. తాజాగా ఇండియా, పాక్ ఆటగాళ్ల తీరుపై 1983 వన్డే ప్రపంచకప్ విన్నింగ్ జట్టులో సభ్యుడు, మాజీ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ వ్యాఖ్యానించాడు. క్రీడల్లో రాజకీయాలు చేయకూడదని కిర్మాణీ ఘాటుగా విమర్శించాడు. తాము ఆడిన కాలంలో ఆటను, రాజకీయాలను వేర్వేరుగా చూసేవాళ్లమని, ఇండియా నుంచి పాక్ కు, పాక్ నుంచి ఇండియాకు ఆటగాళ్లు వచ్చి మ్యాచ్ లు ఆడేవారని, అయితే ప్రస్తుత తరుణంలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక ఆసియాకప్ లో ఇరుదేశాల క్రికెటర్లు .. రాజకీయాలను ఆటల్లోకి తీసుకొచ్చారని ఆక్షేపించాడు.ఆసియాకప్ లో ఆటగాళ్ల ప్రవర్తన చూసి చాలా సిగ్గుగా అనిపించిందని, ఈతరం ఆటగాళ్లకు ఏమైందని కిర్మాణి వ్యాఖ్యానించాడు. ఆసియాకప్ లో జరిగినది విచారకరమైందని, ఈ విషయంపై స్పంంచాలని తనకు ఎన్నో మెసేజీలు వచ్చాయని పేర్కొన్నాడు. క్రికెట్ జెంటిల్మన్ గేమ్ అని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించాడు. మరోవైపు ఈసారి ఆసియాకప్ నిర్వహణ వివాదాలకు గురైన సంగతి తెలిసిందే. పాక్ హెూం మంత్రి, పీసీబీ ఛీఫ్, ఏసీసీ అధ్యక్షుడు అయిన మోహ్సిన్ నఖ్వి నుంచి కప్పును స్వీకరించబోమని, టీమిండియా తేల్చి చెప్పడంతో నఖ్వి ఆ కప్పును తన వెంట తీసుకెళ్లడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యిం. తాజాగా జరిగిన ఘటనలు క్రికెట్ ప్రేమికులను నివ్వెరపరుస్తున్నాయని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# శ్రీలంకపై భారత్ సూపర్ విక్టరీ



2025 మహిళల వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసిం. శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లోనే భారత్ ఘన విజయం సాధించిం. గువాహటి వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై టీమ్‌ఇండియా 59 పరుగుల తేడాతో నెగ్గిం. డక్ వర్త్ లూయిస్ ప్రకారం 47 ఓవర్లలో 271 పరుగుల ఛేదనలో దిగిన లంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయ్యిం. భారత్ బౌలర్లలో దీప్తి శర్మ 3, స్నేహ్ రానా, శ్రీ చరణి చెరో 2, క్రాంతి గౌడ్, ప్రతీకా రావల్, అమన్‌జోత్ కౌర్ తలో 1 వికెట్ పడగొట్టారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఇరుజట్లకు 47 ఓవర్లకు కుంచారు. భారత్ 269-8 పరుగులు చేసిం. ఇక డక్‌వర్త్ లూయిస్ ప్రకారం శ్రీలంక టార్గెట్‌ను 271గా నిర్ణయించారు. ఈ ఛేదనలో లంక 30 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిం. ఓపెనర్ హాసిని పెరీర (14 పరుగులు)ను క్రాంతి గౌడ్ క్లీన్ బౌల్డ్ చేసిం. ఆ తర్వాత వన్ డౌన్‌లో వచ్చిన సమరవిక్రమ (29 పరుగులు)తో కెప్టెన్ అటపట్టు (43 పరుగులు) మంచి భాగస్వామ్యం నిర్మించిం. రెండో వికెట్ కు ఈ ఇద్దరూ 52 పరుగులు జోడించారు.ఈ జోడీని జట్టు స్కోర్ 82 వద్ద దీప్తి శర్మ విడగొట్టిం. అటపట్టు 43 పరుగులకు ఔట్ అయ్యిం. ఆ తర్వాత లంక వికెట్లు త్వరత్వరగా కూలాయి. సమరవిక్రమ (29), వింశీ గుణరత్నే (11), కవిశ దిల్హారీ (15), అనుష్క సంజీవని (6) స్వల్ప స్కోర్లకే ఔట్ అయ్యారు. దీంతో 140 రన్స్‌కు లంక 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిం. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 47 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 269 పరుగులు చేసిం. అమన్ జోత్ కౌర్ (57 పరుగులు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (53 పరుగులు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. చివర్లో స్నేహ్ రానా (28 పరుగులు, 15 బంతుల్లో) రఫ్ఫాడించిం. వీళ్లతోపాటు ప్రతీకా రావల్ (37 పరుగులు), హర్లీన్ డియోల్ (48 పరుగులు), హర్మన్‌ప్రీత్ కౌర్ (21 పరుగులు) ఆకట్టుకున్నారు. లంక బౌలర్లలో ఇనోకా రనవీర 4 వికెట్లు దక్కించుకుంది. ఉదేశిక ప్రబోధిని 2, కులసూరియా, చమరి ఆటపట్టు తలో 1 వికెట్ పడగొట్టారు.

# పీసీబీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయండి

## మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ బాధ్యతల నుంచి మోహసీన్ నఖ్వీ తప్పుకోవాలని ఆ జట్టు మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు వైఫల్యం నేపథ్యంలో అఫ్రిది ఈ ప్రతిపాదన చేశాడు. పాకిస్థాన్ మంత్రిగా.. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ న్యాయం చేయలేకపోతున్నాడని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్ క్రికెట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపే ఛైర్మన్ కావాలని అఫ్రిది నొక్కి చెప్పాడు.ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు భారత్ చేతిలో ఘోర పరాజయాలను ఎదుర్కొంది. భారత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడింటిని పాకిస్థాన్ ఓడిపోయింది. ఫైనల్లో పోటీ ఇచ్చినా తొలి రెండు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కూడా నఖ్వీ వ్యవహరిస్తున్నాడు. కీలక పదవుల్లో ఉన్న నఖ్వీ పూర్తిగా సలహాదారుపై ఆధారపడుతున్నాడని అఫ్రిది ఆరోపించాడు.పీసీబీ ఛైర్మన్, పాకిస్థాన్ మంత్రి అయిన మోహసిన్ నఖ్వీ సాబ్‌కు నా అభ్యర్థన, సలహా ఏంటంటే.. పీసీబీ ఛైర్మన్ బాధ్యతల నుంచి వీలైనంత త్వరగా తప్పుకోవాలి. పీసీబీ అనేది పాకిస్థాన్ మంత్రిత్వ శాఖ కంటే పూర్తిగా భిన్నమైనది. కాబట్టి పీసీబీకి ఆయన దూరంగా ఉండాలి. పాకిస్థాన్ క్రికెట్‌కు ప్రత్యేక శ్రద్ధ, సమయం కేటాయించే వ్యక్తి అవసరం. నఖ్వీ పూర్తిగా సలహాదారులపైనే ఆధారపడుతున్నారు. ఈ సలహాదారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. క్రికెట్ గురించి తెలియదని



ఆయనే స్వయంగా చెప్పారు. కాబట్టి ఆట గురించి తెలిసిన వ్యక్తులను పీసీబీ ఛైర్మన్‌గా, సలహాదారులుగా నియమించాలి.'అని అఫ్రిది విజ్ఞప్తి చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీ సందర్భంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. అయితే ఈ ఘటనపై పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ అనవసర వివాదాన్ని సృష్టించాడు. మ్యాచ్ రిఫరీని తొలగించాలంటూ ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. ఐసీసీ పట్టించుకోకపోవడంతో టోర్నీ నుంచి తప్పుకుంటామని బెదిరింపులకు దిగాడు. ఇక ఆసియా కప్ ఫైనల్ అనంతరం నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకునేందుకు భారత్ నిరాకరించడంతో.. ఆ టైటిల్‌ను ఆటగాళ్లకు ఇవ్వకుండా తన వెంట తీసుకెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. క్షమాపణలు చెప్పిన నఖ్వీ.. టైటిల్ కావాలంటే ఏసీసీ ఆఫీస్‌కు వచ్చి తీసుకెళ్లాలని కండిషన్ పెట్టాడు. దాంతో మరింత ఆగ్రహానికి గురైన బీసీసీఐ.. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పోలీసులకు 'ఐబొమ్మ' వార్నింగ్

## మీరు మాపై ఫోకస్ చేస్తే.. మేము మీపై ఫోకస్ చేయాల్సి ఉంటుంది



తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టాన్ని కలిగిస్తున్న పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. ఇప్పటివరకు సినీ నిర్మాతలను, హీరోలను బెదిరిస్తూ వచ్చిన ఈ సైట్ నిర్వాహకులు, ఇప్పుడు ఏకంగా హైదరాబాద్ పోలీసులకే సవాల్ విసిరారు. తమపై దృష్టి సారిస్తే తాము కూడా పోలీసులపై దృష్టి పెట్టాల్సి వస్తుందంటూ బహిరంగంగా హెచ్చరించడం సంచలనం సృష్టిస్తోంది.

ఇటీవల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (%ఖీజజ%), ఐబొమ్మ సహా 65 పైరసీ వెబ్‌సైట్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి ఒక పైరసీ ముఠాను ఛేదించి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, ఐబొమ్మ వంటి సైట్లను ఎంతటి సాంకేతికత వాడినా వదిలిపెట్టేది లేదని, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వారిని పట్టుకుంటామని గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

సీపీ చేసిన ఈ హెచ్చరికలపై ఐబొమ్మ నిర్వాహకులు స్పందిస్తూ ఒక లేఖ విడుదల చేశారు. "మీరు మాపై ఫోకస్ చేస్తే.. మేము మీపై ఫోకస్ చేయాల్సి ఉంటుంది" అంటూ పోలీసులకే ఎదురు వార్నింగ్ ఇచ్చారు. పైరసీ కారణంగా కేవలం 2024లోనే తెలుగు చిత్ర పరిశ్రమకు సుమారు ?3,700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. థియేటర్లలో రహస్యంగా చిత్రీకరించడం, డిజిటల్ సర్వర్లను హ్యాక్ చేసి హెచ్‌డీ ప్రింట్లను దొంగిలించడం వంటి పద్ధతుల్లో ఈ ముఠాలు పనిచేస్తున్నాయని వివరించారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా వీరికి కోట్ల రూపాయల ఆదాయం వస్తోందని, ఈ లావాదేవీలన్నీ క్రిప్టోకరెన్సీ రూపంలో జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు.

నిర్మాతలను బెదిరించిన పైరసీ సైట్లు ఇప్పుడు ఏకంగా పోలీసులకే సవాల్ విసురుతున్న నేపథ్యంలో, ఈ వ్యవహారాన్ని హైదరాబాద్ పోలీసులు ఎంత సీరియస్‌గా తీసుకుని ముందుకు వెళ్తారో వేచి చూడాలి.

# అల్లు అర్జున్ సినిమాలో సమంత?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో రోజుకో ఆసక్తికర వార్త ప్రచారంలోకి వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో హాట్ టాపిక్ ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఓ కీలకమైన ప్రత్యేక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ సమంతను తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలుస్తోంది.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కథను మలుపు తిప్పే ఒక స్పెషల్ రోల్ ఉందట. ఆ పాత్రకు సమంత అయితే సరిగ్గా సరిపోతుందని భావించిన మేకర్స్, ఇప్పటికే ఆమెను సంప్రదించి చర్చలు జరిపినట్లు చెబుతున్నారు. ఈ ప్రత్యేక పాత్ర కోసం సమంతకు దాదాపు రూ. 3 కోట్ల వరకు పారితోషికం ఆఫర్ చేసినట్లు కూడా గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఈ ఆఫర్‌కు సమంత కూడా సుముఖంగా ఉన్నారని, దాదాపుగా అంగీకరించినట్లేనని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది.'పుష్ప' సినిమాలో ఐటమ్ సాంగ్‌తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సమంత, ఆ తర్వాత నటిగా, నిర్మాతగా తన కెరీర్‌లో ముందుకు సాగుతున్నారు. ఆమెకున్న పాన్-ఇండియా క్రేజ్ దృష్ట్యా, అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఆమె ఉనికి ప్రాజెక్ట్‌కు మరింత బలాన్ని చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ వార్తలపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారమే నిజమైతే, ఈ క్రేజీ కాంబినేషన్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం.



# మెగాస్టార్ సరసన 'శశిరేఖ'.. ఆకట్టుకుంటున్న నయనతార లుక్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార పాత్ర పేరుతో పాటు ఆమె ఫస్ట్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు.

ఈ చిత్రంలో నయనతార 'శశిరేఖ' అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించారు. పాత్రకు సంబంధించిన లుక్‌ను కూడా విడుదల చేయగా, అది ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా, దసరా పండగ సందర్భంగా రేపు మరో సర్‌ప్రైజ్ కూడా రాబోతోందని అనిల్ రావిపూడి తన పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. పండగ రోజు రాబోయే ఆ కొత్త కబురు ఏమై ఉంటుందా? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటిస్తుండటం విశేషం. చిరంజీవి, వెంకటేశ్ వంటి అగ్ర తారలు కలిసి నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని గతంలోనే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# నాగార్జున పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు

**అనుమతి లేకుండా పేరు, వాయిస్ వాడొద్దని హైకోర్టు కఠిన ఆదేశాలు**

**ఏఐ, డీప్‌ఫేక్‌లతో దుర్వినియోగానికి పాల్పడితే చర్యలని హెచ్చరిక**



ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన వ్యక్తిగత హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) రక్షణ కల్పిస్తూ న్యాయస్థానం కీలక మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీలను ఉపయోగించి తన పేరు, స్వరం, ఫొటోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాలకు వాడుకోవడాన్ని సవాల్ చేస్తూ నాగార్జున ఈ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ తేజస్ కారియా నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. నాగార్జున నుంచి ముందస్తు అనుమతి పొందకుండా ఆయన పేరును గానీ, స్వరాన్ని గానీ ఎలాంటి వాణిజ్య ప్రకటనల కోసం ఉపయోగించరాదని కోర్టు స్పష్టం చేసింది. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డీప్‌ఫేక్స్ వంటి టెక్నాలజీల ద్వారా నాగార్జున గుర్తింపును దుర్వినియోగం చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో సెలబ్రిటీల హక్కుల పరిరక్షణకు సంబంధించి ఈ తీర్పు ఒక మైలురాయిగా నిలుస్తుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# ఆకట్టుకుంటున్న ధనుశ్ 'తేరే ఇష్క్ మే' టీజర్



ప్రముఖ నటుడు ధనుశ్, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ కలయికలో వచ్చిన 'రాంజానా' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు ఈ విజయవంతమైన కాంబినేషన్‌లో 'తేరే ఇష్క్ మే' అనే మరో ఆసక్తికర చిత్రం రాబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. టీజర్‌ను బట్టి చూస్తే, ఇది ఒక తీవ్రమైన, భావోద్వేగభరితమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా టీజర్‌లో ధనుశ్ చెప్పిన ఓ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నా తండ్రి దహన సంస్కారాల కోసం బనారస్ వెళ్లాను. అప్పుడే నీకోసం కాస్త గంగాజలం తీసుకురావాలనిపించింది. నువ్వు కొత్త జీవితం మొదలుపెడుతున్నావు కదా, కనీసం నీ పాత పాపాలను అయినా కడుక్కో" అంటూ కథానాయిక కృతి సనన్‌ను ఉద్దేశించి ధనుశ్ చెప్పే డైలాగ్ బాగుంది. ప్రేమలో మోసపోయిన ఓ యువకుడి ఆవేదన ఆయన పాత్రలో కనిపిస్తోంది. ఈ చిత్రంలో ధనుశ్ ఒక ఎయిర్‌ఫోర్స్ అధికారిగా నటించనున్నారు. ఆయన సరసన కృతి సనన్ కథానాయికగా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# హీరోయిన్ డింపుల్ హయతిపై కేసు నమోదు

వివాదాలతో తరచూ వార్తల్లో నిలిచే సినీ నటి డింపుల్ హయతి, తాజాగా మరో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తన ఇంట్లో పనిచేస్తున్న సహాయకురాలికి జీతం ఇవ్వకుండా చిత్రహింసలకు గురిచేశారన్న ఫిర్యాదుపై ఆమె, ఆమె భర్తపై హైదరాబాద్‌లోని ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనతో ఆమె మరోసారి చర్చనీయాంశంగా మారారు.

వివరాల్లోకి వెళితే, డింపుల్ హయతి ఇంట్లో ఒడిస్సాకు చెందిన ఇద్దరు యువతులు కొంతకాలంగా పనిచేస్తున్నారు. అయితే, వారికి సరైన జీతం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. జీతం అడిగినందుకు తమను చిత్రహింసలు పెట్టడమే కాకుండా, ఉన్నపళంగా ఇంట్లోంచి బయటకు గెంటేశారని ఆరోపిస్తూ బాధితులు ఆమె నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధితులలో ఒకరైన పనిమనిషి ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. జీతం ఇవ్వకపోగా, కుక్క అరిచిందన్న చిన్న కారణంతో తనపై దాడి చేయబోయారని, నగ్నంగా చేసి ఆ దృశ్యాలను వీడియో తీసేందుకు ప్రయత్నించారని ఆమె తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. తన భర్త లాయర్ అంటూ డింపుల్ తమను బెదిరించినట్లు కూడా బాధితురాలు పేర్కొన్నారు.

